విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

బేటీ బచావో.... ప్రకటనలకే పరిమితం

మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లుపెద్ది రత్న కుమారి

విశాలాంధ్ర-చల్లపల్లి : నరేంద్రమోడీ ప్రభుత్వంలో బేటీ బచావో... నినాదం కేవలం ప్రకటనలకే పరిమితం అయ్యిందని ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మల్లుపెద్ది రత్నకుమారి విమర్శించారు. ఢిల్లీలో జరుగుతున్న మహిళా రెజ్లర్ల ఉద్యమానికి మద్దతుగా సంతకాలు సేకరించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రత్నకుమారి మాట్లాడుతూ దేశానికి ఎన్నో పతకాలను సాధించి, గౌరవాన్ని పెంచిన మహిళా రెజ్లర్ల పై లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్ భూషణ్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాలుగు నెలల నుంచి మహిళా రెజ్లర్లు లో ఢిల్లీలో శాంతియుతంగా పోరాటం సాగిస్తున్నప్పటికీ కేంద్రం స్పందించకపోవడం సిగ్గుచేటని అన్నారు. . బేటి బచావో భేటీ పడావో నినాదం ప్రకటనలకే పరిమితమైనది తప్ప ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వంలో ఆడపిల్లలకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. దేశానికి ఎన్నో కీర్తి ప్రతిష్టల్ని తీసుకొచ్చిన రెజ్లర్లు ఇలా రోడ్డు పైకి రావడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు కంఠంనేని జ్యోత్స్నా దేవి పాల్గొన్నారు.

ఎర్రదండు కదిలింది

విశాలాంధ్ర-చల్లపల్లి : కృష్ణలంక భూ పోరాట యోధుడు, కామ్రేడ్ మాలెంపాటి బాల భాస్కరరావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా చల్లపల్లిలో ఏర్పాటుచేసిన మహాసభకు ఎర్రదండు కదిలి వచ్చింది. మండల పరిధిలోని నిమ్మగడ్డ గ్రామంలోని బాల భాస్కర్‌రావు స్థూపం వద్ద నివాళులర్పించి కమ్యూనిస్టు పార్టీ నాయకులు కార్యకర్తలు డప్పు వాయిద్యాలతో బైక్‌ర్యాలీగా చల్లపల్లి చేరుకున్నారు. చల్లపల్లిలోని కోమలానగర్ నుండి పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు పాదయాత్రగా సభా ప్రాంగణానికి తరలి వచ్చారు. తొలుత ప్రాంగణంలోని కమ్యూనిస్టు పార్టీ జెండాని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీవీ సత్యనారాయణమూర్తి ఆవిష్కరించారు.

అమరవీరుల స్థూపాన్ని సీనియర్ కమ్యూనిస్టు పార్టీ నాయకులు, చండ్ర రాజేశ్వరరావు వికాస్ కేంద్రం అధ్యక్షులు మేక నరసింహారావు నివాళులర్పించారు. డప్పు కళాకారుల నృత్యాలు, ప్రజానాట్యమండలి నాయకులు ఆలపించిన విప్లవగేయాలతో సభా ప్రాంగణం దద్దరిల్లిపోయింది.

రాష్ట్ర ఉర్దూ అకాడమీ సభ్యురాలిగా నజరానా

విశాలాంధ్ర-చల్లపల్లి : రాష్ట్ర ఉర్దూ అకాడమీ పాలకమండలి నూతన సభ్యురాలిగా వైఎస్ఆర్ సీపీ సీనియర్ నాయకురాలు, అవనిగడ్డ నియోజకవర్గం చల్లపల్లికి చెందిన షేక్ దిల్షాద్ నజరానా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎండీ ఇంతియాజ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వైసీపీ రాష్ట్ర నాయకులు, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు రాజులపాటి శివప్రసాద్, చల్లపల్లి జడ్పీటీసీ రాజులపాటి కళ్యాణి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం జరిగింది. వైసీపీ రాష్ట్ర నాయకులు రాజులపాటి శివప్రసాద్, జడ్పీటీసీ రాజులపాటి కళ్యాణి నజరానాకు ఘనంగా సన్మానం చేశారు. మైనారిటీ విభాగం నియోజకవర్గ నాయకులు అబ్దుల్ కమాల్, చల్లపల్లి ప్రభుత్వ ఆసుపత్రి డైరెక్టర్ అబ్దుల్ కరీం, ముస్లిం మైనారిటీ రాష్ట్ర నాయకులు పఠాన్ కరీముల్లా ఖాన్ ఘనంగా సన్మానం చేశారు. అరబ్బీ మదరసా నిర్వాహకులు మహమ్మద్ ఆరీఫ్, వైసీపీ ముస్లిం నాయకులు ముజీబ్, సికిందర్, సుభాని, మెండు వీరబాబు ఘనంగా సన్మానం చేశారు.

ఉరిమిలో గడ్డివాము దగ్ధం

విశాలాంధ్ర-పెడన : కృష్ణాజిల్లా పెడన నియోజకవర్గం పెడన మండలం ఉరిమి గ్రామంలో కోనసాని దుర్గారావు 15 ఎకరాల గడ్డివాము దగ్ధమైంది. సుమారు రెండు లక్షల రూపాయలు విలువ గల గడ్డివామును అర్ధరాత్రి రెండు గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారని గతంలో వడ్ల బస్తాలకు నిప్పంటించారని దుర్గారావు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వారు తక్షణమే స్పందించి న్యాయం చేయాలని కోరుకుంటున్నాను. అగ్నిమాపక దళం వారు వచ్చి మంటలను అదుపు చేశారు.

నాట్య కళాపీఠాన్ని సందర్శించిన న్యాయమూర్తి

విశాలాంధ్ర-కూచిపూడి : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి నాట్య కళా పీఠాన్ని గురువారం సాయంత్రం నందిగామ సబ్ జడ్జి ఖాసిం కుటుంబ సభ్యులతో సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి కళాకారుల జీవిత విశేషాలను వెల్లడిచేశారు. ఈ కార్యక్రమంలో కళా పీఠం విద్యార్థిని విద్యార్థులు, సిబ్బంది, లైబ్రరీ అధికారి ఫణి కుమార్ పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు తెలుగు నేర్పించాలి : మండలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ముందుగా తెలుగు నేర్పించమని అధికార భాష సంఘానికి మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ సూచించారు. గురువారం మండలి తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అధికార భాష సంఘం అధ్యక్షులు విజయ్ బాబు, తెలుగుదేశం పార్టీ వారికి తెలుగు నేర్పిస్తామని ఒక పత్రికా సమావేశంలో చెప్పారన్నారు. ముఖ్యమంత్రి ప్రతి సభలోను తెలుగును స్పష్టంగా పలకలేకపోవడం విజయ్ బాబు గమనించడం లేదా అని మండలి ప్రశ్నించారు. విజయవాడలో తెలుగు భాషా ఉద్యమ సమైఖ్య సమావేశంలో తానెక్కడా రాజకీయాలు మాట్లాడలేదని విజయబాబు పేరు గానీ, ముఖ్యమంత్రి పేరుగానీ ఎత్తలేదని తాను అధికార భాష సంఘం అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఎదుర్కొన్న సమస్యలను, సాధించిన విజయాల గురించి మాత్రమే మాట్లాడానని బుద్ధప్రసాద్ అన్నారు. అప్పటికంటే ఇప్పుడు సాంకేతికత అభివృద్ధి చెందినది కనుక అధికార భాషగా తెలుగును అమలుచేయడం చాలా సులువు అన్నారు. అనువాద యాంత్రీకరణ వచ్చిన తరువాత తెలుగును సులువుగా అధికార భాషగా అమలు చేయవచ్చని చెప్పానని ఎక్కడా రాజకీయం చేయలేదని విజయబాబే రాజకీయాలు చేస్తునట్లు మాట్లాడారు కనుక మొదటి సారి రాజకీయ కోనంలో మాట్లాడుతున్నాని మండలి అన్నారు. ఈ ప్రభుత్వ హయాంలో ఎన్ని జీఓలు తెలుగులో వచ్చాయో విజయ్‌బాబు చెప్పాలని బుద్ధప్రసాద్ అన్నారు.

పర్యావరణాన్ని కలుషితం కాకుండా కాపాడుకుందాం

విశాలాంధ్ర-అవనిగడ్డ : పర్యావరణాన్ని కలుషితం కాకుండా కాపాడుకుందాం అని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. గ్రేడ్ 1 గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణా తరగతులలో భాగంగా గురువారం ఉపాధ్యాయులు విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పడం, చదవడం, ఇంగ్లీషు గ్రామర్, భగవత్ గీతా శ్లోకాలు, యోగా, కవితలు, డ్యాన్స్, తెలుగు పద్యాలు, పాటలు పాడటం, వంటి కార్యక్రమాలపై శిక్షణ ఇచ్చారు. గ్రేడ్ 1 గ్రంథాలయ అధికారి ప్రభుదాసు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమానికి ఫారెస్ట్ అధికారిణి ఎ.ఎల్ అరుణ కుమారి విచ్చేసి విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్గించి పర్యావరణాన్ని కాపాడుకుంటాం అని ప్రతిజ్ఞ చేయించారు. ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలను పర్యావరణంలో వేసి పర్యావరణం కలుషితం చేయొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంగ్లీషు టీచర్ ఎ సీతారామ్, ఎమ్ శేషగిరిరావు, పి అవినాష్ లతో పాటు సిబ్బంది పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు సక్రమంగా నిర్వహించాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను సక్రమంగా నిర్వర్తించారా అక్రమాలకు పాల్పడ్డారా అనే విషయంపై తనిఖీ బృందం మూడు రోజులుగా తనిఖీలు చేపట్టారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక లో అధికారులు పలు సూచనలు చేశారు. ఎం.పి.పి తుంగల సుమతీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు ఎ.పి.డి రమణారావు, జడ్.పి.టి.సి చింతలపూడి లక్ష్మీనారాయణ, సోషల్ ఆడిట్ మరియు ఇన్‌చార్జ్ ఎం.పి.డి.ఓ పి శైలజా కుమారి, ఎం.పి.టి.సి సభ్యులు, సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ అసోసియేట్ ప్రొఫెసర్ నీరజ పద్మకు ఇంగ్లీషులో డాక్టరేట్

విశాలాంధ్ర-విజయవాడ ఎడ్యుకేషన్ : విజయవాడకు సమీపంలోని ఆగిరిపల్లి మండలం పోతవరప్పాడులోని ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్, జాతీయస్థాయి కబడ్డీ క్రీడాకారిణి ఎ నీరజ పద్మకు ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం (గుంటూరు) ఇంగ్లీషులో డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. నీరజ పద్మ సమర్పించిన "సెలెక్ట్ వర్క్స్ ఆఫ్ డోరిస్ లెస్సింగ్స్ అనే థీసిస్‌కు ఎఎన్‌యు ఆంగ్లంలో హ్యూమానిటీస్ ఫ్యాకల్టీలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ డిగ్రీ అవార్డును ప్రదానం చేసింది. ఆంధ్రా యూనివర్సిటీ ఇంగ్లీషు విభాగం హెచ్ఓడి ప్రొఫెసర్ టి నారాయణ పర్యవేక్షణలో నీరజ పద్మ డోరిస్ లెస్సింగ్ అనే రచయిత ఆలోచనా విధానంలో స్త్రీవాద దృక్కోణాలు అనే అంశంపై పరిశోధన చేయగా, ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం నుంచి డాక్టరేట్ లభించింది. నీరజ పద్మ అధ్యాపక రంగంలోకి ప్రవేశించక మునుపు జాతీయస్థాయి కబడ్డీ క్రీడాకారిణిగా రాణించారు. అఖిల భారత అంతర్ విశ్వ విద్యాలయ మహిళల కబడ్డీ పోటీలలో ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయానికి ప్రాతినిధ్యం వహించి బంగారు పతకాన్ని సాధించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి నాగ భాస్కర్, రీసెర్చ్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ డాక్టర్ జి రోశయ్య, ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్‌వి సురేంద్రబాబు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

బండే జయలక్ష్మికి నివాళులు

విశాలాంధ్ర-కోడూరు : కోడూరు మండల మాజీ జెడ్పీటీసీ సభ్యులు ప్రస్తుత కోడూరు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు బండే శ్రీనివాసరావు మాతృమూర్తి జయలక్ష్మి ఇటీవల మృతి చెందడంతో అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నేతలు ఆయనను పరామర్శించారు. ముందుగా జయలక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో విజయ పాల ఫ్యాక్టరి చైర్మన్ చలసాని ఆంజనేయులు, డైరెక్టర్ వేమూరి సాయి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మల చౌదరిబాబు, సి.డి.సి.చైర్మన్ రావి నాగేశ్వరరావు,నరశింహపురం పాల సంఘం అధ్యక్షులు దోనేపూడి ప్రసాద్, విశ్వనాధపల్లి పాల సంఘం అధ్యక్షులు తోట లక్ష్మణరావు, తదితరులు ఉన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం : రాబోవు సంవత్సరంలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని, జిల్లాలో ఏడు రకాల ప్రభుత్వ యాజమాన్యాల విద్యాసంస్థలు ఉన్నాయని, వాటిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల జాబితా పక్కాగా సిద్ధం చేసుకుని ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి రాజబాబు తెలిపారు. జిల్లాలో పదవ తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థుల అభినందన కార్యక్రమాన్ని ఈనెల 25, 27 తేదీల్లో ఘనంగా నిర్వహిస్తామని కలెక్టర్ అన్నారు. గురువారం మధ్యాహ్నం విజయవాడ నుండి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ ప్రకాష్ తదితర ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్లతో పదవ తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థిని విద్యార్థుల అభినందన కార్యక్రమం ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కలెక్టరేట్లోని వారి చాంబర్ నుండి పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతూ పదవ తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులను అభినందించే కార్యక్రమాన్ని సమర్థులైన ముఖ్యమంత్రి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, వివిధ ప్రభుత్వ శాఖల కార్యదర్శులు, శాఖాధిపతులు గతంలో ఎన్నడూ లేని విధంగా తొలిసారిగా చేపట్టడం ఎంతో ఉదాత్తమైనదన్నారు. ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని విద్యాసంస్థల్లో చదువుతున్న ప్రతిభగల విద్యార్థులకు ఇప్పటివరకు ఎలాంటి గుర్తింపు లేదని అటువంటిది నేడు వారిని గుర్తించి అభినందించడం గొప్ప విషయం అన్నారు. ఇప్పటివరకు ఇలాంటి వేదిక ఉండేది కాదన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థలు వారి గురించి ఎంతగానో ప్రచారం చేసుకుంటున్న ఈ తరుణంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతూ మంచి మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులను అభినందించే కార్యక్రమం చేపట్టడం విద్యార్థుల్లో ఎంతగానో స్ఫూర్తిని, ప్రోత్సాహాన్ని నింపుతుందన్నారని అన్నారు. పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో కృష్ణాజిల్లా 75 శాతం ఫలితాలు సాధించి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. గత సంవత్సరం 10వ తరగతిలో 65 శాతం ఫలితాలు వచ్చాయని, ఈ సంవత్సరం 10 శాతం అధికంగా 75 శాతం ఫలితాలు సాధించాలని అన్నారు. శాసనసభ్యులతో సంప్రదించి ఈనెల 25వ తేదీన నియోజకవర్గాల స్థాయిలో, 27వ తేదీన జిల్లాస్థాయిలో అభినందన కార్యక్రమాన్ని మంత్రి సూచనల మేరకు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్ లను ప్రభుత్వం తరపున పతకాలు, ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు, శాలువాలతో ఘనంగా సత్కరిస్తామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ సంయుక్త కలెక్టర్‌ను ఈ కార్యక్రమాల కన్వీనర్‌గా నియమిస్తున్నామని వారి ఆధ్వర్యంలో అన్ని పనులు సజావుగా నిర్వహించాలని డీఈవో తహేరా సుల్తాన్ కు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ఛాంబర్ నుండి డీఈవో తహేర సుల్తానా, డివిఈవో ప్రసాద్, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ డేవిడ్ రాజు, ఉప విద్యాధికారి సుబ్బారావు, డిసిఇబి కార్యదర్శి మోమిన్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలపై నిరసన ర్యాలీ

విశాలాంధ్ర-కూచిపూడి : నిరుపేద అక్క చెల్లెమ్మలకు జగనన్న ఇస్తున్న నివేశన స్థలాలభూమిలో శవాన్ని కూడా పూడ్చలేము మీరు ఇల్లు ఎలా కడుతున్నారు అంటూ జగనన్న ఇళ్ల స్థలాల లబ్ధిదారులపై నారా చంద్రబాబు నాయుడు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ గ్రామంలో మసీదు సెంటర్ నుంచి గురువారం సాయంత్రం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పామర్రుశాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన సెంటు భూమిసమాధి కట్టుకోవడానికి పనికొస్తుందన్న చంద్రబాబు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ చంద్రబాబు నాయుడు క్షమాపణ చెప్పాలంటూ నినాదాలు చేశారు. పేదలంటే చంద్రబాబుకు చిన్న చూపుని 40, సంవత్సరాల ఇండస్ట్రీ చంద్రబాబుదిగజారి వ్యాఖ్యలు చేస్తున్నారని, పేద ప్రజల ఉన్నది చేరుకోవడం చంద్రబాబు ఇష్టం ఉండదని వ్యాఖ్యానించారు. పేదలకు అహంకార వాదులకు మధ్య రాష్ట్రంలో ఇద్దరం జరుగుతుందని చంద్రబాబు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం అహంకారానికి తరపున పడుతుందని, తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకొని పేదలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండేటి ఇందిరా, జడ్పీటిసి రాజులపాటి పార్వతి, సర్పంచ్ కొమరగిరి అంజలి, లతోపాటు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన కార్యకర్తలతో నిడుమోలు సంతరించుకుంది. అనంతరం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అధికారులు, సచివాలయ సిబ్బంది, కలిసి నిర్వహించారు.

రాష్ట్రస్థాయి మహిళ ఫిడే రేటింగ్ చదరంగం పోటీలను ప్రారంభించిన కలెక్టర్ ఢిల్లీరావు

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : స్థానిక గేట్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ అండ్ సైన్సెస్ గురునానక్ కాలనీ, విజయవాడ నందు రాష్ట్రస్థాయి మహిళ ఫిడే రేటింగ్ చదరంగం పోటీలను గురువారం ఎన్టీఆర్ జిల్లా మెజిస్ట్రేట్ అండ్ కలెక్టర్ ఎస్ ఢిల్లీ రావు జ్యోతి ప్రజ్వలన చేసి చదరంగం పోటీలను ప్రారంభించారు. చదరంగం క్రీడాకారులు చేసే ప్రతి పని ఆలోచించి ఉన్నతమైన విజయాలను అందుకుంటారన్నారు. తల్లిదండ్రులు క్రీడల పట్ల ఆసక్తితో తమ పిల్లలను రాణిస్తున్నారని, ఇటువంటి చదరంగం పోటీలకు సహాయ సహకారాలను అందిస్తున్నటువంటి రోటరీ మిడ్ టౌన్ గేట్స్ మేనేజ్మెంట్ వారిని అభినందించారు. ఈ చదరంగం పోటీలకు రాష్ట్రంలోని అన్ని మారుమూల ప్రాంతాల నుంచి 78 మంది మహిళా క్రీడాకారులు పాల్గొన్నారు. మొదటి రోజు రెండు రౌండ్లు జరగగా టాప్ సీడ్ ఎన్టీఆర్ జిల్లా క్రీడాకారిని ఉమెన్ ఫిడే మాస్టర్ లాస్య జి, అనంతపురం క్రీడాకారిణి అస్మిత ఏ. పై గెలుపొందగా రెండవ సీడ్ ప్రకాశం జిల్లా క్రీడాకారిణి ఉమెన్ ఫిడే మాస్టర్ కే సాయి నిరూపమా, ఎన్టీఆర్ జిల్లా క్రీడాకారిణి అయిన నారాయణ రిషిత పై గెలుపొందగా, మూడవ సీడ్ కృష్ణాజిల్లా క్రీడాకారిణి ఉమెన్ ఫీడ్ మాస్టర్ పి సుప్రీత అదే జిల్లాకు చెందిన కే శరణ్యపై గెలుపొందారు.

21న మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర-విజయవాడ : ప్రముఖ విద్యా సంస్థ వివేకానంద సెంటినరీ హైస్కూల్ ఆధ్వర్యంలో ప్రఖ్యాత ఎంజే నాయుడు సూపర్‌స్పెషాలిటీ హాస్పటల్ సహకారంతో ఈ నెల 21వ తేది ఆదివారం ఉచిత అధునాతన మెగా వైద్య సేవా శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంజే నాయుడు హాస్పటల్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు వావిలాల రజనీకాంత శర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగ్‌నగర్‌లోని వివేకానంద హైస్కూల్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ శిబిరం ఉంటుందని పేర్కొన్నారు. ఎముకలు, కీళ్లు, నరాలు, కండరాల సమస్యలపై వైద్య నిపుణులు రవితేజ, వంశీకృష్ణలతో పాటు సాంకేతిక సహాయకులు, ఫిజియోథెరపిస్టులు పాల్గొని విశేష సేవలు అందిస్తారని తెలిపారు. పక్షవాతానికి గురైన వారు త్వరగా కోలుకోవటానికి అవగాహన కల్గిస్తారని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ది లాంచ్ ఆఫ్ మదర్ ఇండియా ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ (వన్ టౌన్) : మదర్స్ డే సందర్భంగా దుబాయ్‌లోని ప్రతిష్టాత్మక అర్మానీ హెూటల్, బుర్జ్ ఖలీఫాలో మదర్ ఇండియా ప్రోగ్రాం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించినట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. భారతదేశం, యూఏఈ, సౌదీ అరేబియా, యునైటెడ్ కింగ్‌డమ్, జపాన్‌ల నుండి ఇతర వ్యాపారవేత్తలు, ప్రతినిధులలో శసబిహా షేక్, లలిత్ రాజ్ పండిట్, సలేహ్ షావ్ల్ అల్ యామి, డాన్ లుండ్‌క్విస్ట్‌లతో సహా పలువురు ప్రతినిధులు హాజరైన ఈ కార్యక్రమం అద్భుతమైన విజయాన్ని సాధించిందన్నారు. మదర్ ఇండియా ప్రోగ్రామ్ గురించి వ్యవస్థాపకుడు నక్కా వెంకట్ రావు మాట్లాడుతూ, సాధ్యమైన అన్ని విధాలుగా తల్లులను గౌరవించడం, గుర్తించడం, మద్దతు ఇవ్వడం ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

వేసవి శిబిరంలో నీతి కథలు

విశాలాంధ్ర-పమిడిముక్కల: గ్రంథాలయాలల్లో వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు పమిడిముక్కల శాఖ గ్రంథాలయం లో నీతి కథలు చదివించి అందులోని నీతి తెలిపినట్లు గ్రంథాలయ పాలకులు బి.శ్రీనివాసరావు తెలిపారు.గురువారం కపిళేశ్వరపురం గ్రంథాలయాం లో స్థానిక ఎఎన్ఎమ్ కె.ప్రసన్న కుమారి చే ఆరోగ్య సూత్రాలు విద్యార్థులకు వివరించారు.కాగ అగినపర్రు మేడూరు పెనుమత్స గ్రంథాలయాల్లో నీతి కథలు చదివించనట్లు ఆయా గ్రంధపాలకులు తెలిపారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

విశాలాంధ్ర-ఘంటసాల: జ్ఞాన సముపార్జనకు ఎన్నో మార్గాలు ఉన్నాయని వాటిలో యోగా ఒక ముఖ్యమైన సాధనమని యోగ ఉపాధ్యాయురాలు టి రాధా పేర్కొన్నారు. మండల పరిధిలోని కొడాలి శాఖ గ్రంథాలయం నందు గ్రంథాలయాల అధికారి ఎం సుబ్బారావు ఆధ్వర్యంలో 10 వ రోజు సమ్మర్ క్యాంపు నిర్వహించారు . ఆయన మాట్లాడుతూ మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గ్రంథాలయాలు ద్వారా గ్రామాలలోని విద్యార్థిని విద్యార్థులు భాగా ఉపయోగించుకోవాలనే లక్ష్యంతో వేసవిలో ఈ శిక్షణా శిబిరం కార్యక్రమం ఇచ్చారని అన్నారు. అలాగే గ్రంథాలయాలు విజ్ఞాన బండాగారాలని, బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇటువంటి గ్రందలయలలోనే చదువుకొని భారత రాజ్యాంగాన్ని నిర్మించి ప్రపంచంలో పెద్ద మేధావి కాగలిగారన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

విశాలాంధ్ర-కూచిపూడి : ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో కృష్ణాజిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాలతో మొవ్వ మండలంలోని మొవ్వ, నిడుమోలు ప్రాథమికఆరోగ్య వైద్య కేంద్రంల సచివాలయాల పరిధిలోని గ్రామాలలో వడదెబ్బ నివారణ సూచనలు ఇస్తూ ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. దీనిలో భాగంగానే కూచిపూడి లో రైతు బజార్, బస్ స్టేషన్, అంగన్వాడీ కేంద్రాలు లో ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ ఎం వేద రాజ్ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త కె రామాంజనేయులు, సి హెచ్ ఓ కే దివ్య, ఆశా వర్కర్లు జశాంక, పద్మజాకుమారి, రైతు బజార్ సూపర్వైజర్ పడవల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

విశాలాంధ్ర-ఘంటసాల: విద్యార్థులు యోగా చేయడంతో మానసిక శారీరక ఉల్లాసంతో పాటు జ్ఞాన సమపార్జన విద్యార్థులకు అత్యధికంగా లభిస్తుందని ఉపాధ్యాయులు శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండల కేంద్రమైన ఘంటసాల శాఖ గ్రంథాలయం నందు 11వ రోజు వేసవి శిక్షణ శిబిరం గ్రంథాలయ అధికారి ఎం శరత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరంలో విద్యార్థులతో పుస్తక పఠనం తో పాటు విద్యార్థుల్లో మెదడు చురుకుదనం తో పనిచేయడానికి చెస్ లూడో ఆటలు ఆడించడం జరిగిందని ఆయన అన్నారు..

గోద్రెజ్ నుంచి రుణ సౌకర్యం

విశాలాంధ్ర-విజయవాడ (వన్ టౌన్) : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భాగస్వామ్యంతో ఆయిల్ పామ్ రైతుల కోసం మొట్టమొదటిసారిగా వినూత్నమైన ఫైనాన్స్ ఆఫర్‌ను ప్రారంభించినట్లు గోద్రెజ్ అగ్రోవెట్ యొక్క ఆయిల్ పామ్ బిజినెస్ ఒక ప్రకటన ద్వారా తెలిపింది. ఫ్రెష్ ఫ్రూట్ బంచ్‌ల ఉత్పాదకతను మెరుగుపరచడం ద్వారా ఆయిల్ పామ్ పెరుగుదలకు సహాయపడే లక్ష్యంతో పరిచయం చేసిన ఈ సదుపాయంతో పంట మొదటి ఐదేళ్ల కాలంలో తోటలను నిర్వహించడానికి ఉత్ప్రేరకంగా పనిచేస్తుందనీ వివరించారు.

ప్రభుత్వ రంగ సంస్థల్ని కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్న మోదీ

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : సరళీకృత ఆర్థిక విధానాలను బూచిగా చూపిస్తూ ప్రైవేటైజేషన్ పేరుతో ప్రభుత్వ ఆస్తులను తమకు అనుకూలమైన విదేశీ,స్వదేశీ కార్పొరేట్ శక్తులకు అప్పనంగా కట్టబెట్టడాన్ని కార్మికులు,ప్రజలందరు తీవ్రస్థాయిలో వ్యతిరేకిస్తూన్నారని అయిన మోదీ ప్రభుత్వం మొండిగా వ్యవహిరస్తుందని దీనిని ప్రతి ఒక్కరు ప్రతిఘటించాలని పలువురు నాయకులు పిలుపు నిచ్చారు. గురువారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో జర్నలిస్ట్ మిత్రుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎ.వి.వి. శ్రీనివాస్ అధ్వర్యంలో ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలి అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు.దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకర్ మాట్లాడుతూ బీజేపీ హయాంలో ప్రజాస్వామ్యానికి పెద్ద ముప్పు ఏర్పడిందన్నారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. మన అంబేద్కర్ రాజ్యాంగంలో అందరికీ వాక్ స్వాతంత్రం ఉందని అయితే మోదీ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రశ్నించినా,వ్యతిరేకించినా ఈడీ, సీబీఐ అంటూ వేధింపులకు గురి చేస్తున్నారన్నారు.మోదీ పరిపాలన పరిశీలిస్తే అన్ని రంగాలు, ముఖ్యంగా ప్రభుత్వ రంగాలు ప్రైవేటీకరణ రూపంలో కనుమరుగు అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దాంతో కార్మికులకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. దాంతో విపరీతంగా పెరుగుతుందన్నారు. దేశ సంపద మొత్తం అదాని,అంబానీకి దొచిపెడుతున్నారన్నారు. గుజరాతి అయిన మహాత్మా గాంధీ దేశానికి స్వాతంత్రం తీసుకు వస్తే మోదీ అంబానీ,ఆదోనిలకు అమ్మేస్తున్నారని విమర్శించారు. మతం పేరిట ప్రధాని కర్ణాటకలో ఎన్నికల ప్రచారంలో జై భజరంగభళీ అని ప్రజలను బీజేపీకి ఓటు వేయమన్నారని ,ఈ మత ప్రచారం చేసినందుకు ఎన్నికల సంఘం నిద్రపోతుందా అని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు ఈ విషయాన్ని సుమోటోగా స్వీకరించాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ నాయకులు కొలనుకొండ శివాజీ మాట్లాడుతూ మోదీ అవినీతి ప్రశ్నించటంతో పాటు అదానీ-అంబానీలతో ఉన్న సంబంధాలు గురించి వారికి దొచిపెట్టిన లక్షల కోట్లు పెట్టు పెట్టుబడులు గురించి పార్లమెంట్ లో అడిగినందుకు రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వం రద్దు చేశారన్నారు.కరోనా ముందు వరకు 609వ స్థానంలో ఉన్న అదాని ప్రపంచ కుబేరులు రెండవ స్థానంలోకి ఏ విధంగా వచ్చారన్నారు. దీనికి కారణం ప్రధానమంత్రి ఏ దేశానికి వెళితే ఆ దేశం నుండి ఆదానికి పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. బీజేపీకి అనుకూలంగా వున్నవారికి కేసులు,శిక్షలు ఉండవని, ప్రశ్నించిన వారికి కేసులు జైలులో పెట్టటం చేస్తూన్నారన్నారని ఆరోపించారు. మత రాజకీయాలు చేస్తున్నందునే కర్ణాటకలో బీజేపీని ఓడించి కాంగ్రెస్‌ను ప్రజలు గెలిపించారని చెప్పారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాహుల్ గాంధీ మొదటి సంతకం ఏపీకి ప్రత్యేక హోదా మీద పెడతారని, పోలవరం కూడా పూర్తి చేస్తారని అన్నారు. ఎవివి.శ్రీనివాస్ మాట్లాడుతూ సరళీకృత ఆర్థిక విధానాలను బూచిగా చూపిస్తూ ప్రతిష్ఠాకరమైన ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూన్నారన్నారు. ఇటువంటి దుర్మార్గామైన చర్యలను వ్యతిరేకిస్తూన్నామన్నారు. సమాజం పట్ల బాధ్యత కలిగిన జర్నలిస్టులుగా తమ వంతుగా అన్ని పార్టీ నాయకులతో కలసి పనిచేయాలనే ఈ సమావేశం నిర్వహించినట్లు వివరించారు. ఈ సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి సభ్యులు కేవీ భాస్కరరావు, ఆంధ్రప్రదేశ్ ప్రొఫెషనల్ ఫోరమ్ అధ్యక్షులు నేతి మహేశ్వరరావు, ముస్లిం ఆలోచనపరుల వేదిక కన్వీనర్ ఏ.ఎం ఖాన్ యజ్దానీ సీనియర్ జర్నలిస్టు ఆర్.భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకపఠనం అలవరచుకోవాలి

విశాలాంధ్ర-తిరువూరు: పుస్తకపఠనంతో విద్యార్థులు జ్ఞాపకశక్తి పెంపొందించుకోవచ్చునని తెలుగు భాషా వికాస సమితి అధ్యక్షుడు తోట ఉమామహేశ్వర రావు సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం వేసవి శిక్షణ తరగతులలో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. మాతృభాషైన తెలుగులో వ్యాసరచన, వర్ణమాల తప్పక నేర్చుకోవాలని, తెలుగు పద్యాలు అభ్యసించాలని ఉమామహేశ్వర రావు విద్యార్థులకు ఉద్బోధించారు. జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని భరతకుమారి, గ్రంధాల అధికారిణి పద్మావతి, జే శ్రీలత పాల్గొన్నారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

అభివృద్ధి పనులు వేగవంతం

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : రీసర్వే, జాతీయ రహదారుల విస్తరణ, గృహ నిర్మాణాల స్టేజ్ కన్వర్షన్ అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్.జవహర్‌రెడ్డి గురువారం ఆయన కార్యాలయం నుండి కలెక్టర్లతో రీసర్వే, జాతీయ రహదారుల విస్తరణ, గృహ నిర్మాణాలు, జగనన్న పాల వెల్లువ అంశాలపై నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో స్థానిక కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వే పూర్తి అయిన గ్రామాల్లో సర్వే రాళ్ళను నాటే ప్రక్రియ తుది దశకు చేరుకుందన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం అర్జీలను నాణ్యతతో అర్జీదారుల సంతృప్తి మేరకు పరిష్కరిస్తున్నామన్నారు. గృహ నిర్మాణాల లేఅవుట్లలో మౌలిక వసతులు కల్పించి నిర్దేశించిన లక్ష్యాల మేరకు వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలను వేగవంతం చేస్తున్నామన్నారు. జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 3,345 గ్రామాల్లోని 22,884 మంది పాడి రైతులను నమోదు చేసి వారికి వైఎస్సార్ చేయూత, స్త్రీ నిధి, ఉన్నతి, బ్యాంక్ లింకేజ్ ద్వారా 2,041 పశువులను అందించామన్నారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో జేసీ డాక్టర్ పీ.సంపత్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ కే.శ్రీనివాస్‌రావు, హౌసింగ్ అధికారి ఎం.రజినీ కుమారి, వ్యవసాయ శాఖాధికారి ఎస్.నాగమణమ్మ, జిల్లా సర్వే అధికారి కే.సూర్యారావు, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి సీహెచ్.శైలజ, జిల్లా మత్స్యశాఖాధికారి ఎ.నాగరాజ పశుసంవర్ధక శాఖ జేడీ కే.విద్యాసాగర్, ఉద్యాన శాఖాధికారి పీ.బాలాజీ కుమార్ పాల్గొన్నారు. ఎన్నికల ప్రక్రియను సజావుగా సక్రమంగా నిర్వహించేలా ఎన్నికల కమీషన్ నిర్దేశిస్తున్న విధి విధానాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లు, డీఇవో, ఏఆర్‌వో, ఈఆర్‌వోలతో సచివాలయం నుండి ముఖేష్ కుమార్ మీనా గురువారం నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో స్థానిక కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు జరిగే సమయంలో అభ్యర్థుల నుండి నామినేషన్లు స్వీకరించేందుకు ప్రత్యేక ఏర్పాట్లలో భాగంగా నామినేషన్ ఫారం, నామినేషన్ రిజిస్టర్, ఎలక్ట్రోరల్ రోల్, ఓత్‌ఫారాలు, ఆర్వో హ్యాండ్‌బుక్, వివిధ ధరఖాస్తులు, ఫార్మట్స్‌లు, రిజిస్ట్రర్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. భౌతికంగా రిటర్నింగ్ అధికారి ఛాంబర్, ఇండికేషన్ బోర్డు, ఫ్లెక్సీలు, ఫర్నిచర్, సిసిటివి, వీడియోగ్రఫీ, 100 మీటర్ల మార్కింగ్, కంప్యూటర్లు, సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. నామినేషన్లు స్వీకరించిన అనంతరం పరిశీలన తుది అభ్యర్థుల జాబిత ప్రచురణ తదితర అంశాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో జేసీ డాక్టర్ పీ.సంపత్‌కుమార్, వీఎంసీ కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్, సబ్ కలెక్టర్ అదితి సింగ్, డీఆర్‌డీఏ పీడీ కే.శ్రీనివాస్, ఆర్‌డీవోలు రవీంద్రరావు, వైవీ.ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

దుర్గగుడి ఏఈఓ వెంకట రెడ్డి సస్పెండ్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దేవస్థానంలో ఏఈఓగా విధులు నిర్వహిస్తున్న వెంకటరెడ్డి సస్పెండ్‌కు అయ్యారు. తెలిసిన సమాచారం మేరకు దుర్గగుడిలో పనిచేస్తున్న ఏఈఓ వెంకటరెడ్డి అదే ఆలయంలో అన్నదానం క్లీనింగ్ కాంట్రాక్టర్ మరుపిళ్ళ రవికి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం స్టేడియంలో నిర్వహించిన లక్ష్మీ మహాయజ్ఞం కార్యక్రమాలకు వచ్చేవారికి భోజనాల కాంట్రాక్టు కోసం సర్వీస్ సర్టిఫికెట్ ఇచ్చారు. చివరి రోజు 20 వేల మందికి భోజనాలు కోసం అదికూడా దుర్గగుడి ఈవో లెటర్ హెడ్‌పై అనధికారికంగా సంతకం చేసి వెంకటరెడ్డి సర్వీస్ సర్టిఫికెట్ ఇచ్చినట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న ఆలయ కార్యనిర్వహణాధికారి భ్రమరాంబ గురువారం ఏఇఓ వెంకట రెడ్డిని సస్పెండ్ చేశారు.

అంబేద్కర్ స్మృతివనం పనులు వేగవంతం

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : పీడబ్ల్యూడి గ్రౌండ్స్‌లోని అంబేద్కర్ స్మృతి వనంలో జరుగుతున్న పనులను మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధువారం అర్ధ రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం కమిషనర్ గురువారం ఉదయం కూడా అంబెద్కర్ స్మృతి వనంలో జరుగుతున్న పనులను పరిశీలించి బుధువారం రాత్రి కేటాయించిన పనులను పరిశీలించారు. పనులను ఇంకా వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కారిడార్ మొత్తంలో గ్రానైట్ ఫుట్ ఫాత్, ల్యాండ్ స్కెఫ్, కాంపౌండ్ వాల్ నిర్మాణాన్ని పరిశీలించారు. అనతరం కమిషనర్ బంగ్లాలో క్వాలిటీ కంట్రోల్ అధికారులు, ఎపీఐఐసీ అధికారుత కే.పి.సి. ప్రాజెక్ట్ కాంట్రాక్టర్లతో కలసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ అంబెద్కర్ స్మృతి వనం పనులు శరవేగంగా జరగాల్సి ఉండగా గత కొన్ని రోజుల నుంచి రాత్రి పూట పనులు చాలా నెమ్మదిగా జరుగుతున్నాయన్నారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడ పొరపాట్లు లేకుండా అంబేద్కర్ విగ్రహ నిర్మాణం జరగాలని సూచించారు.

వాహన త్రైమాసిక పన్ను తగ్గించాలి

విశాలాంధ్ర-విజయవాడ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 25 నుంచి 30 శాతం మేర రవాణా వాహనాల త్రైమాసిక రహదారి పన్ను పెంచుతూ తెచ్చిన జీవో 31 ఉపసంహరించుకోవాలని ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు తుమ్మల లక్ష్మణస్వామి డిమాండ్ చేశారు. విజయవాడలోని అసోసియేషన్ హాలులో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పక్క రాష్ట్రాల కన్నా అధిక చమురు ధరలతో, రెండొందల నుంచి 22 వేల రూపాయలకు పెరిగిన హరిత పన్నుతో ఇప్పటికే రవాణా రంగం సంక్షోభంలో ఉందన్నారు. లారీ యజమానుల సంఘ విజ్ఞప్తులు పట్టించుకోకుండా ప్రభుత్వం జీ.ఓ. 31 తీసుకువచ్చిందన్నారు. ఈ పెంపుపై ప్రభుత్వం పునరాలోచన చేయకపోతే ప్రత్యక్ష ఆందోళన చేపడతామని హెచ్చరించారు. లారీ యజమానుల పరిస్థితి రైతులు కన్నా దారుణంగా ఉందన్నారు. వ్యవసాయ మద్దతు ధరల మాదిరిగానే ప్రభుత్వమే రవాణా వాహనాలకి కిలోమీటరుకు రవాణాధర నిర్ణయించాలన్నారు. రవాణా రంగాన్ని కనీస మాత్రంగా కూడా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదన్నారు. ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి వీర వెంకయ్య మాట్లాడుతూ రవాణా పన్నుల భారం కారణంగా లారీ యజమానులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, కొత్తగా ఈ రంగంలోకి వచ్చేవారు వేరే రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకునే పరిస్థితిని ప్రభుత్వం కల్పిస్తోందని విమర్శించారు. లారీ పరిశ్రమ ఇక్కడి పన్నుల కారణంగా పక్క రాష్ట్రాలకు తరలిపోతే ఈ రాష్ట్రప్రభుత్వం ఆదాయం కోల్పోతుందని హెచ్చరించారు. రవాణా పరిశ్రమకు ప్రభుత్వ సహాయం దాదాపు శూన్యం అని విమర్శించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు కోనేరు నాగేశ్వరరావు, మద్ది వెంకట కృష్ణారెడ్డి, కార్యదర్శులు ఆళ్ల వెంకటేశ్వరరావు, వి. కృష్ణంరాజు పాల్గొన్నారు.

వృద్ధుడి అనుమానాస్పద మృతి

విశాలాంధ్ర-పెడన : పెడనపట్టణ పరిధిలో బ్రహ్మపురం 23వ వార్డు పంట కాలువ వద్ద ఒక వృద్ధుడి మృతదేహం పడి ఉండటం స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు.

దీంతో అక్కడికి చేరుకున్న ఎస్సై రవిచంద్ర కుమార్ మృత దేహాన్ని బయటకు తీయించారు అయితే గత రెండు రోజుల కిందట ఒక యువకుడు వచ్చి తమ తాత ఆచూకీ తెలవడం లేదని స్టేషన్లో ఫిర్యాదు చేశాడని పేర్కొన్నారు ఆ వ్యక్తి ఇతనేనని నిర్ధారణకు వచ్చినట్లు తెలిపారు అంతేగాక స్థానికులు ఆ మృతదేహాన్ని చూసి ఇతను కొండ బ్రహ్మానందంగా(72) గుర్తించారన్నారు ఇతను బ్రహ్మపురములో నివాసం ఉంటున్నాడని స్థానికులు తెలిపారు అన్నారు వెంటనే మృదేహాన్ని పంచనామా నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించి అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశామని ఎస్సై రవిచంద్ర కుమార్ తెలిపారు.

పట్టణంలో ఆర్ఆర్ఆర్ సెంటర్లు ప్రారంభం

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : పురపాలక సంఘం పరిధిలో జూన్ 6 వ తేదీ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భముగా కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు పురపాలక సంఘంలో మేరా లైఫ్ మేరా స్వచ్ఛ నగర్ రెడ్యూస్- రీ సైకిల్ -రియూజ్ (ఆర్.ఆర్.ఆర్.) పురస్కరించుకొని, ఈ నెల 17వ తేదీ నుండి జూన్, 4వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడునని మున్సిపల్ కమిషనర్ సిహెచ్. మల్లేశ్వరరావు తెలిపారు. జగ్గయ్యపేట పట్టణంలో 1వ సచివాలయం-పాత గురుకుల పాఠశాల, 3వ సచివాలయం-పాత మున్సిపల్ ఆఫీసు మరియు 9వ సచివాలయం-పాతగడ్డ వీధి నందు ఏర్పాటు చేసిన ఆర్.ఆర్.ఆర్ సెంటర్ను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిరుపయోగంగా ఉన్న దుస్తులు, బూట్లు, చెప్పులు, టోపీలు, పరుపులు, బెడ్ షీట్లు, దుప్పట్లు, పుస్తకాలు, బ్యాగ్ లు, పిల్లలు ఆడుకునే బొమ్మలు, సైకిళ్ళు, చెక్క కుర్చీలు, ఇనుప కుర్చీలు, టేబుల్స్, చెక్క మంచాలు, ఇనుప మంచాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, తదితర వస్తువులను ఈ సెంటర్ కు అందిస్తే, వారు వాటి అవసరం ఉన్న ఇతరులకు అందచేస్తారని తెలిపారు. ఈ సెంటర్ కు నిరుపయోగంగా ఉన్న వస్తువులు ఇవ్వదలచిన వారు తమ ఏరియాలోని సచివాలయ శానిటేషన్ సెక్రటరీకి సమాచారం ఇవ్వాలని సూచించారు. వారు ఆయా వస్తువులను ఆర్.ఆర్.ఆర్ సెంటర్ కు తరలిస్తారని తెలిపారు. మనకు పనికిరాకుండా ఉండి, ఇతరులకు ఉపయోగపడే వస్తువులను వారికి అందించి సహాయపడే విధముగా అవకాశం కల్పిస్తున్న స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ సేవలకు పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

క్రీడలతో మానసిక వికాసం

విశాలాంధ్ర- కంచికచర్ల: కంచికచర్ల పట్టణంలో మెగా క్రికెట్ టోర్నమెంట్ ను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు గురువారం ప్రారంభించారు. కంచికచర్ల పట్టణంలోని హై స్కూల్ గ్రౌండ్స్ లో జై భీమ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ జిల్లా స్థాయి మెగా క్రికెట్ టోర్నమెంట్ ను శాసనసభ్యులు ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులతో మాట్లాడుతూ పరిచయం చేసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థులలో మానసిక వికాసం కలుగుతుందన్నారు. క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల స్నేహభావం పెంపొందుతుందని, అంతేకాకుండా ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తితో ఆడి, గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. అదేవిధంగా వేసవిలో తీవ్రమైన ఎండలు నమోదవుతున్న కారణంగా క్రీడాకారులు తగు జాగ్రత్తలు తీసుకో వాలని, వడదెబ్బ తగలకుండా జాగ్రత్త వహించాలన్నారు. అనంతరం కొద్దిసేపు క్రీడాకారులతో కలిసి క్రికెట్ ఆడి వారిని ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది జై భీమ్ శ్రీనివాస్ మరియు వైసిపి మాజీ మండల కన్వీనర్ నెలకుదిటి శివ నాగేశ్వరరావు, క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

4న జిల్లా సీనియర్ స్విమ్మింగ్ జట్ల ఎంపిక

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : కృష్ణ ఎన్టీఆర్ జిల్లాల ఆక్వాటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూన్ 4వ తేదీన జిల్లా సీనియర్ స్విమ్మింగ్ బాల బాలికల జట్ల సెలక్షన్ ట్రయల్స్ ను నిర్వహించనున్నట్లు కార్యదర్శి ఐ. రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెలక్షన్ ట్రైల్స్ ను నగరంలోని సర్ విజ్జి స్విమ్మింగ్ పూల్ లో నిర్వహించనున్నట్లు, 2006, 07, 08 సంవత్సరాల్లో పుట్టిన క్రీడాకారులు మాత్రమే పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జూన్ 10న విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారు అన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 31వ తేదీలోపు తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు.

బ్రహ్మ దేశం సోషల్ సర్వీసెస్ సొసైటీ అన్నదానం

విశాలాంధ్ర-విజయవాడ (వన్ టౌన్) : డాక్టర్ బ్రహ్మ దేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మాతృ దేవో భవ వృద్ధాశ్రమం లోని వృద్ధులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. గురువారం జన్మదిన సందర్భముగా కొండపల్లి జిష్ణు తండ్రి కొండపల్లి వెంకటేశ్వర రావు దాతృత్వం లో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఆనందకరమైన విషయమని సొసైటీ అధ్యక్షులు డాక్టర్ బ్రహ్మ దేశం వసంత కుమార్ అన్నారు.తొలుత ఆశ్రమం లోని వృద్ధులు అన్నదాత కొండపల్లి వెంకటేశ్వర రావు కు ధన్యవాదములు,జిష్ణుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియ చేసారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మా సొసైటీ ద్వారా సేవా కార్యక్రమాలు లో పాల్గొనాలని కార్యదర్శి కొండాయ గుంట రాము పిలుపునిచ్చారు. ఈ అన్న దాన కార్యక్రమం లో డాక్టర్ బ్రహ్మ దేశం వసంత కుమార్,కార్యదర్శి కొండాయ గుంట రాము,గుర్రం ఏడు కొండలు,ఆశ్రమ నిర్వాహకులు పి,దుర్గా, జ్ఞానేంద్ర,పి,భార్గవి,ప్రమీల,కొప్పిసెట్టి సీతా రామా రావు తదితరులు పాల్గొన్నారు.

నాడు - నేడు పనులు వేగవంతం

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: నాడు - నేడు పథకం ద్వారా విద్యాలయాల్లో చేపట్టాల్సిన పనులను వచ్చే నెల 8వ తేదీలోపు పూర్తి చేయాలని ఎంపీడీవో ఎస్.వెంకటరమణ సూచించారు. విస్సన్నపేట మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. వచ్చే విద్యాసంవత్సరం ఆరంభం నేపథ్యంలో జూన్ 8వ తేదీలోగా విద్యాలయాలను నాడు-నేడు పథకం ద్వారా సుందరీకరించాలని సూచించారు.

కుట్టు శిక్షణా టీచర్ల దరఖాస్తులు

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగర పాలక సంస్థ మూడు సర్కిల్స్ కార్యాలయాల పరిధిలోని స్లమ్ ఏరియాల్లోని మహిళాలకు స్వయం ఉపాధి కల్పించటంలో భాగంగా 22 కుట్టు శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వీఎంసీ యూసీడీ పీవో శకుంతల తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నగర పాలక సంస్థ యూసీడీ విభాగం ప్రాజెక్ట్ ఆఫీసర్ శకుంతలను వ్యక్తి గతంగ గాని, 8074658624లో సంప్రదించాలని తెలిపారు.

కల్వర్ట్ పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : స్థానిక 13, 15 వార్డుల్లో పట్టణ ప్రజల సౌకర్యార్థం 15వ ఆర్థిక సంఘం నిధులు 2021-2022 ద్వారా రూ.30 లక్షల వ్యయంతో బంగారు పేట వద్ద ఊర చెరువును ఆనుకుని ఉన్న అలుగు పైన కల్వర్ట్ మరియు రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్ పర్సన్ తుమ్మల ప్రభాకర్, వార్డు కౌన్సిలర్లు, పట్టణ ప్రముఖులు, మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, అసిస్టెంట్ ఇంజినీర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్య సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : మానసిక ఆరోగ్య సమస్యలను పరిష్కరించడంలో ఎల్లప్పుడు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అలాగే ప్రతి ఒక్కరు జీవితంలో మానసిక-శారీరక ఆరోగ్యానికి సమాన ప్రాముఖ్యత ఇవ్వాలని సౌత్ సెంట్రల్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ విజయవాడ డివిజన్ అధ్యక్షురాలు డాక్టర్ జయమోహన్ అన్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ (ఎస్సీఆర్ డబ్ల్యూడబ్ల్యూఓ) విజయవాడ ఇ-వరల్డ్ ఇంటర్నీస్ కోసం మానసిక క్షేమం- డిజిటల్ అడిక్షన్‌పై వర్క్‌షాప్ నిర్వహించింది. గురువారం డివిజనల్ రైల్వే ఆడిటోరియంలో. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ ఆరోగ్యం, శ్రేయస్సు అనేది యూనిసెఫ్ యొక్క ప్రధాన స్థిరమైన అభివృద్ధి లక్ష్యం అన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో మానసిక,శారీరక ఆరోగ్యానికి సమాన ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు.మానసిక క్షేమంపై ఇటువంటి వర్క్‌షాప్‌లు కళంకం, వివక్ష, ప్రజలు ఎదుర్కొనే సవాళ్లు,సహోద్యోగి,స్నేహితులు, కుటుంబ సభ్యులతో మానసిక ఆరోగ్యం గురించి ఎలా చర్చించాలనే దానిపై దృష్టి సారిస్తాయన్నారు. మిలీనియల్, జనరేషన్ జెడ్‌లకు డిజిటల్ వ్యసనం గొప్ప సవాలు అన్నారు. దీని ఫలితంగా అసంపూర్తిగా ఉన్న పనులు, మరచిపోయిన బాధ్యతలు, ఏకాగ్రత కోల్పోవడం,నిశ్చల జీవనశైలి అన్నారు. డిజిటల్ డిటాక్స్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ప్రకృతి సౌందర్యం, సుదీర్ఘ నడక, సహజమైన పరిసరాలను దృశ్యమానంగా ఆస్వాదించింది. ఇంద్రియాలను శాంతపరచడానికి, ఆందోళనను అధిగమించడానికి ఉత్తమ ప్రత్యామ్నాయాలు అన్నారు. రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ నిర్వహిస్తున్న ఈ-వరల్డ్ సెంటర్‌లో ఇంటర్న్‌షిప్ చేస్తున్న దాదాపు 250 మంది విద్యార్థులు ఈరోజు వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ శ్రీదేవి, ఇ- వరల్డ్ సెక్రటరీ గాయత్రి, ప్రియాంక, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీల యూజీసీ నిధులు విడుదలకు జీఓ

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : కేంద్ర ప్రభుత్వం 7వ పే కమిషన్ ప్రకారం యూనివర్సిటీల యు.జి.సి క్రింద రావాల్సిన బకాయిలు మొత్తము విడుదల చేయటానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వలన ఎంతో మందికి మేలు జరుగుతుందని ఇందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఆంధ్ర యూనివర్సిటీ రిటైర్డ్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ రిటైర్డ్ ప్రొఫెసర్ జాగారపు రాము నాయుడు తెలిపారు.గురువారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఎంతో కాలంగా ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఈ సమావేశంలో ఎస్.ఆర్.ఆర్ కాలేజ్ ప్రిన్సిపాల్ డి. కోటేశ్వరరావు, మాజీ ప్రొఫెసర్ కెఎస్ తిలక్, జెడ్.విష్ణువర్ధన్, ఎం.శివప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, ZULEKHA SHIFA (old Name) D/o. AFZAL HUSSAIN RUKNUDDIN, H.No : 27-11-30, 2nd Floor, Mary Street, Buckinghampet, Governorpet, VIJAYAWADA - 520 002, AP. Have Change My Name to ZULEKHA SHIFA RUKNUDDIN (New Name) Here after My Name is known as ZULEKHA SHIFA RUKNUDDIN

KVB Karur Vysya Bank — Smart way to bank

బంగారు నగల వేలం ప్రకటన

బెంజిసర్కిల్, విజయవాడ.

ఈ దిగువ తెలిపిన నగలను బ్యాంకు వారు బహిరంగ వేలం ద్వారా వేలం వేయ నిర్ణయించినారు కావున తెలియజేయడమైనది.

వేలం జరుగు స్థలము : ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్, బెంజిసర్కిల్ బ్రాంచి, డోర్ నెం : 40-9-99, రామకృప కాంప్లెక్స్, సాయినగర్,, కృష్ణాజిల్లా, విజయవాడ-520008. ఫోన్స్ : 0866-2480656, 2490656

నగల తనిఖీ, సమయం : 26/05/2023మ॥3-00 గం.ల నుండి మ॥ 3-30 గం.ల వరకు

వేలం జరుగు తేదీ, సమయం : 26/05/2023 మ॥ 3-45 గం.లకు.

వ. సం.	ఋణగ్రహీత పేరు & చిరునామా	ఖాతా నెం.	మొ॥ బరువు	నికర బరువు	రుణం మొత్తం
1)	మన్నె కోటిబాబు ట్రిజ్ టవర్స్, ఫ్లాట్ నెం.203, ఎస్ఐఆర్ సెంటర్, విజయవాడ-521108	48689510 00000441	50.5	45.5	రూ. 1,55,000/-

ముఖ్య నియమ నిబంధనలు :

1) పైన తెలిపిన ఋణ గ్రహీతలకు గతంలో జారీచేసిన నోటీసులకు (అవి ఏ కారణము చేతనైనను తిరిగి వచ్చినను) దీనినే ఆఖరి నోటీసుగా భావించ వలసినది.
2) ఒక వేళ ఋణగ్రహీత మరణించినచో వారి వారసులకు కూడా ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.
3) ధరావత్తును బ్యాంక్ వారిచే వేలం తేదీ మ॥ 3-30 గం.ల వరకు మాత్రమే స్వీకరించబడును.
4) విజయవంతమైన పాటదారుడు వేలం తేదీ మ॥ 4-00 గం.ల లోగా ధరావత్తు మినహా మిగిలిన పాట మొత్తమును చెల్లించి నగలను స్వంత బాధ్యత వహించి పొందవలెను.
5) నగల నాణ్యతను పాటకు ముందుగానే పాటదారుడు సరి చూసుకోవలెను. అందుకు బ్యాంక్ బాధ్యత వహించజాలదు.
6) ఏ విధమైన ముందస్తు ప్రకటన లేకుండానే వేలంను పాక్షికముగా గానీ పూర్తిగా గాని రద్దు చేయు అధికారము బ్యాంక్‌కు కలదు.
7) పాటదారుడు సరైన ఫోటో మరియు చిరునామా ఋజువులను ప్రాథమికముగా దాఖలు చేయుట తప్పనిసరి.
8) ఇతర పూర్తి నియమ నిబంధనల కొరకు పైన ఉదహరించిన బ్రాంచి నందు సంప్రదించగలరు.
9) అమ్మకపు పన్నును కొనుగోలుదారుడే భరించవలసి ఉంటుంది.

విజయవాడ 18-05-2023 — ఇట్లు ది కరూర్ వైశ్యాబ్యాంక్ లిమిటెడ్., బ్రాంచి మేనేజర్

ప్రకటన

నా క్లయింటు ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ, విద్యాధరపురం, రామరాజ్య నగర్, న్యూలేబర్ కాలనీ, క్వార్టర్ నెం.48రు కాపురస్తులు పోలసాని వెంకట సుబ్బయ్య గారి కుమారుడు పోలసాని రామకృష్ణ ప్రసాదరావు గారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియుజేయునది ఏమనగా... నా క్లయింటు ది.15-05-2023న ఉదయం 11.00 గం.ల సమయంలో ఈ దిగువ తెలిపిన ఒరిజనల్ లింకు దస్తావేజు నెం. 675/1996ను తీసుకుని ఒక కవరులో పెట్టుకుని తన ఇంటి వద్ద నుండి బయలుదేరి ఫోటోస్టాట్ నిమిత్తము స్వాతి థియేటర్ సెంటర్‌కు వెళ్ళి చూసుకొనగా సదరు పై తెల్పిన శ్రీ విజయవాడ సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో ది.21-3-1996రుగా రిజిష్టరు కాబడిన ఒరిజనల్ లింకు దస్తావేజు నెం. 675/1996 పోయినదనియు ఎంత వెదికిననూ దొరికి యుండలేదనియు తెలియ జేయుచున్నారు. కావున సదరు ఒరిజనల్ లింకు దస్తావేజు ఎవరికైననూ దొరికిన యెడల ఈ క్రింది చిరునామాలో గాని, నా క్లయింటు అడ్రసులో గాని అందజేసి తగిన పారితోషికం పొందగలరు.

యం. సాయిరాం ప్రసాద్, అడ్వకేట్
డి.నెం.23-22-68, శివాలయం వీధి, సత్యనారాయణపురం, విజయవాడ -11.
సెల్: 9346428921.

ప్రకటన

ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ, విం చిపేట, గొల్లపాలెం గట్టు, డోర్ నెం. 6-13/1-53 [illegible] షేక్ కాలేషా గారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియచేయునది ఏమనగా!

ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తి షేక్ మీరా సాహెబ్ గారి తదనంతరం వారి కుమారులైన షేక్ కాలేషా మరియు లేటు కరీముల్లాలు వారి వారసులై ముస్లిం లా ప్రకారం జాయింట్ హక్కులతో అనుభవించుచూ ఎస్.కె. కరీముల్లాగారు ది. 10-12-2017వ తేదీన కాలం చెల్లించియున్నారు. సదరు జాయింట్ ఆస్తిని పార్టీషన్ కోరుచూ మా క్లయింట్ విజయవాడ ఒకటవ అదనపు సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో ఓ.ఎస్.నెం.2/2023 దావాలో ప్రతివాదులైన షేక్ రఫీ, షేక్ యూసఫ్, షేక్ రోషన్, షేక్ అమీనాబీ మరియు ఇల్లిపిల్లి యుగంధర్‌లపై దాఖలు చేసియున్నారు. సదరు వ్యాజ్యము పెండింగ్‌లో ఉండియున్నది. ఇట్టి స్థితిలో మా క్లయింట్ పరోక్షములో ఎవరైనను క్రయ, విక్రయ, తనఖా మరియు ఇతర లావాదేవీలు జరిపినయెడల చెల్లనేరవనియు, ఎవరైనను సదరు జాయింటు ఆస్తిపై ఏ విధమైన లావాదేవీలు జరిపిన యెడల నా క్లయింట్‌ను బైండు చేయజాలవు. మరియు చట్టరీత్యా తీసుకొను చర్యలకు బాధ్యులగుదురని ఇందుమూలముగా తెలియచేయటమైనది.

షెడ్యూలు : ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ, వించిపేట, డోర్ నెం. 6-13/1-53, రెవిన్యూ వార్డు నెం.4, బ్లాక్ నెం.1 ఓల్డ్ ఎస్సెస్‌మెంట్ నెం. 4227, న్యూ ఎస్సెస్‌మెంట్ నెం. 43935రులో 206.6 చ॥గ॥ల స్థలములో నిర్మించిన గ్రౌండ్ మరియు మొదటి అంతస్తుగా గల బిల్డింగ్‌కు హద్దులు : తూర్పు : జాయింట్ దారి, దక్షిణం : మున్సిపల్ రోడ్డు, పడమర : షేక్ పీరాబీ గారి ఆస్తి, ఉత్తరం : వి.లక్ష్మమ్మ గారి ఆస్తి.

ABDUL MATEEN, cell : 9392972959
MD. KHALEELULLAH, cell : 9440174246
Advocates, SF-3, 2nd Floor, Keerthi Apartments, Pitchaiah Street, Labbipet, Vijayawada - 520 010.

ప్రకటన

నా క్లయింటు అయిన మొహమద్ షాహిద్ రబ్బాని, తండ్రి ఎం.డి. గాలిబ్, ఆర్/ఒ. 42-3/1-87ఎ, కళ్ళేపల్లెవారి వీధి, రామకృష్ణాపురం, విజయవాడ వారి వలన సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా,

నా క్లయింటు తన ఇంటివద్ద నుండి, ఎస్‌బిఐ సత్యనారాయణపురం బ్రాంచి, విజయవాడకు వెళ్తుండగా దారిలో తన అకౌంట్ నెంబరు 20141737895కు సంబంధించిన చెక్‌బుక్ సంతకాలు చేసినటువంటి 607293, 607294, 607295, 607296, 607297, 607298, 607299 గల చెక్కులు మరియు ఇతర పత్రములు గల బ్యాగ్ తన ద్విచక్ర వాహనము నుండి జారిపడిపోయినవి. సదరు విషయమై శ్రీ బ్యాంక్ వారికి తెలియపరచడమైనది.

కావున పై తెలిపిన చెక్ నెంబర్లకు సంబంధించి ఎవరైననూ ఎటువంటి లావాదేవీలు జరిపినను, నా క్లయింటు తీసుకొను చట్టపరమైన చర్యలకు బాధ్యులు కాగలరని ఈ ప్రకటన ద్వారా తెలియపరచడమైనది.

R.V. Rama Krishna, J. Sujatha, J. Dilip Kumar,
Advocates, Kaspavari Street, Governorpet, Vijayawada-2,
cell : 9440175910.